ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఆటలకు చోటేది?

- పాఠశాలల్లో మైదానాలు లేక ఇబ్బందులు
- పాలకుల హామీలే తప్ప కనిపించని ఆచరణ
- భర్తీ కాని వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు

జిల్లాలోని సర్కారు బడుల్లో విద్యాప్రమాణాల మాట ఎలా ఉన్నా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే ఆటలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. చదువుతో పాటు ఆటలు ఉన్నప్పుడే పిల్లలు మానసికంగా, ఆరోగ్యంగా ఎదుగుతారు. కానీ జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో ఆడుకునే మైదానాలు, ఆటల పరికరాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.



ఆసిఫాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆటలు అటకెక్కుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. పాఠశాలల్లో ఓ వైపువ్యాయమా ఉపాధ్యాయుల కొరత అతిగతిలేని మైదానాలతో క్రీడలకు బావి క్రీడాకారులు దూరమవుతున్నారు. దీంతో విద్యార్థులకు క్రీడలు అందని ద్రాక్షగా మిగిలిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులు వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించలేక పోతున్నారు. ఇదిలా ఉండగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న మినీ స్టేడియం జిల్లా ఏర్పాటులో భాగంగా పోలీసుశాఖకు కేటాయించారు. అందులో ఏఆర్ హెడ్‌క్వార్టర్ ను ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలోని యువకులు, క్రీడాకారులు, వాకర్స్ వ్యాయమానికి దూరమవుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగాణాలు క్రీడా సదుపాయాలు లేకపోవడంతో అలంకార ప్రాయంగానే మిగిలిపోతున్నాయి.

● జిల్లాలో 1,258 పాఠశాలలు..

జిల్లాలో మొత్తం 1,258 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 908 ప్రాథమిక, 180 ప్రాథమికోన్నత, 170 ఉన్నత పాఠశాలలున్నాయి. ఇందులో సగానికి పైగా పాఠశాలల్లో క్రీడామైదనాలులేవు. ఇక వ్యాయామ విద్యను బోధించే పీఈటీ, పీఈడీ పోస్టులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఖాళీ పోస్టులు భర్తీకి నోచుకోకుండా ఉన్నాయి. ప్రాథమిక స్థాయి లోనే నిర్బంద వ్యాయమవిద్య ప్రవేశపెట్టి విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదపడే క్రీడలు వ్యాయామం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టాలి. కానీ ఆ దిశగా ప్రభుత్వం దృష్టి సారించడంలేదు. గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు సదుపాయాలకు నోచుకోవడంలేదు. ఈ ప్రాంగణాలు ఊరు చివర నిర్మించడం, చదునుగా లేకపోవడం, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఆటలు ఆడేందుకు అనువుగాలేవు. దీంతో గ్రామీణ క్రీడ ప్రాంగణాలు అలంకరప్రాయంగానే దర్శనమిస్తున్నాయి. దీంతో గ్రామీణ క్రీడకారులు తమలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యతను ప్రదర్శించలేక పోతున్నారు.

● మినీ స్టేడియం పోలీసుశాఖకు..

జిల్లా కేంద్రంలో ఆధునిక హంగులతో లక్షలు వెచ్చించి నిర్మించిన మినీ స్టేడియంను ప్రభుత్వం పోలీ సుశాఖకు కేటాయించింది. 2016లో జిల్లా ఏర్పడిన సందర్భంగా అప్పడే పూర్తయి అందుబాటులో ఉన్న మినీ స్టేడియాన్ని పోలీసుశాఖకు కేటాయించడంతో ప్రస్తుతం ఆ మినీ స్టేడియంలో ఏఆర్ హెడ్‌క్వార్టర్ ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పట్టణంలోని యువ కులు, క్రీడాకారులు, విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు మైదానం లేకుండా పోయింది. ఇక దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు వాకింగ్, జాగింగ్ చేయాలంటే ఇబ్బందులు పడక తప్పడం లేదు. అలాగే పోలీసు, ఆర్మీ ఉద్యోగాల భర్తీ సమ యంలో కసరత్తు చేసుకునేందుకు యువతకు క్రీడామైదానం లేకపోవ డంతో ప్రాక్టిస్ కోసం ఇతర ఖాళీ స్థలాలే దిక్కావుతు న్నాయి. మినీ స్టేడియాన్ని తిరిగి అప్పగించాలని గతంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టినా చర్యలు తీసుకోలేదు.

పకడ్బందీగా అమలు చేయాలి..

- అవిడపు ప్రణయ్, జిల్లా యువజన సంఘం నాయకుడు



పాఠశాలల్లో వ్యాయామ విద్యను పకడ్బందీగా అమలు చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. ప్రభుత్వం క్రీడా మైదానాల నిర్మాణాలతో పాటు ఖాళీగా ఉన్న వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలి. పట్టణంలోని మినీ స్టేడియాన్ని తిరిగి కేటాయిస్తే క్రీడాకారులకు ప్రయోజనకరం.

ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెంచాలి



కళాశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీఐఈవో కళ్యాణి

బెజ్జూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశ సంఖ్య పెంచాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి జి కళ్యాణి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ ఇంటర్ కళాశాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి అధ్యాపకుడు 20 మందిని కళాశాలలో చేర్పించాలని ఆదేశించారు. సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. త్వరలో పాఠశాలల మాదిరిగా కలాశాలలను పేరెంట్స్ కమిటీ మీటింగ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని అన్నారు. కళాశాలలో నాణ్యమైన విద్య అందాలనే ఉద్దేశంతో ప్రతి కళాశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దీని ద్వారా కళాశాలలో జరిగే విద్యాబోధన రాష్ట్ర వ్యాప్తంగా సారి ఒకే సారి కొనసాగేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అధ్యాపకుల పని తీరు కూడా తెలుస్తుందని అన్నారు. కేజీబీవీ విద్యార్థుల చదువుపై ప్రశ్నించారు. వసతులపై ఆరా తీశారు. కళాశాల రికార్డులు తనిఖీ చేశారు. ఆమె వెంట కేజీబీవీ ప్రత్యేక అధికారి అరుణ, అధ్యాపకులు ఉన్నారు.

పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు

ఆసిఫాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలంలోని కేజీబీవీ పాఠ, పర్శనంబాల, మోతుగూడ, సాలెగూడ, ఎల్లారం పాఠశాలల్లో బుధవారం పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు గోర్సింగ్ కుమార్, రవి, సోనేరావు, వసంత్, విద్యాసాగర్, పుష్ప, కవిత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ తదితర పాఠశాలల్లో బుధవారం పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడే సంఘం పీఆర్టీయూ అని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, సుభాష్, ప్రధానోపాధ్యాయురాలు సునీత, సంతోష్, సమత, అనసూయ పాల్గొన్నారు.

కేసు విచారణలో జాప్యం చేస్తే ఊరుకోం

పెంచికలపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఫర్టిలైజర్ దుకాణం యజమాని రాచకొండ కృష్ణ అనే వ్యక్తి వేధింపుల వల్ల మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న రాజశేఖర్ కేసులో జాప్యం చేస్తే ఊరుకోమని డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆగర్‌గూడ గ్రామంలో బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ వ్యక్తి మరణించి సుమారు నెల రోజులు అవుతున్నా కేసులో పురోగతి లేదని చెప్పారు. నిందితుడు బెయిల్ మీద బయటకు వచ్చాడని, సాక్షులను బెదిరింపులకు గురి చేసే ప్రమాదం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు షరీఫ్, బాలాజీ, దేవాజీ, నవీజ్, అనూప్ పాల్గొన్నారు.

పాఠశాలలో బోనాల వేడుకలు

ఆసిఫాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం పురస్కరించుకుని బాబాపూర్ మహాత్మజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులను ధరించి అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుకన్య, ఉపాధ్యాయురాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సన్నాహక సదస్సును విజయవంతం చేయండి

ఆసిఫాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో ఈ నెల 26న నిర్వహించే పెన్షన్‌దారుల మహాగర్జన సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మల్లేష్, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు ఇస్లాంబీన్ హసన్ కోరారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మూర్తి, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో బాలిక మృతి



మన్విత(ఫైల్)

కౌటాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లా కౌటాల మండలం ముత్తంపేట గ్రామానికి చెందిన రాయ్‌పూర్ మన్విత(8) అనే బాలిక బుధవారం సాయంత్రం జ్వరంతో మృతి చెందింది. ముత్తంపేటకు చెదిన వినోద్, జయ దంపతుల కుమార్తె మన్విత రెండు రోజులుగా జ్వరంతో బాధపడు తోంది. ఇంట్లో ఉన్న మందులు వేసినా జ్వరం తగ్గక పోవడంతో బుధవారం కౌటాల ప్రభుత్వ ఆసుపత్రికి తల్లిదండ్రులు తీసుకొచ్చారు. వైద్యులు మందులు రాసి ఇవ్వడంతో మధ్యాహ్నం ఇంటికెళ్లి తీసుకెళ్లారు. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

వాంకిడి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం ఎనోలి గ్రామానికి చెందిన మారు(36) అనే యువకుడు గ్రామ శివారులోని పత్తి చేనులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోయం మారుకు 15ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు కుమా రులు, కూతురు ఉన్నారు. ఈ నేపథ్యంలో మారు మద్యానికి బానిసై రోజు ఇంట్లో గొడవ పడుతుండేవాడు. మంగళ వారం ఉదయం మారు భార్యకు ఆరోగ్యం బాగలేక చిన్న కుమారుడిని వెంటబెట్టుకుని ఆసుపత్రికి వెళ్లింది. వచ్చేసరికి మారు పెద్ద కొడుకుతో గొడవ పడుతూ కనిపించాడు. దీంతో మారు భార్య కొడుకుతో ఎందుకు గొడవ పడుతున్నావు అన్ని ప్రశ్నిస్తూ తాగొచ్చావని మందలించింది. దీంతో ఇంట్లో నుంచి వెళ్లిన మారు ఇంటికి రాలేదు. బుధవారం ఉదయం గ్రామ శివారులో వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు.

జీవో 49ని రద్దు చేయాలి

చింతలమానేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జీవో 49ని రద్దు చేయాలని బుధవారం తుడుందెబ్బ, రాయిసెంటర్, ఆదివాసీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్, అటవీశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. పీసీ చట్టం ప్రకారం జీవో 49నిరద్దు చేయాలని అన్నారు. ఈ మేరకు ప్రతి గ్రామంలో గ్రామసభలో తీర్మానం చేశామని చెప్పారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుగుణాకర్, కనకయ్య, సాగర్, భీమేష్, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఆవాసాల అభివృద్ధే ధ్యేయం



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న కేంద్ర సహాయ మంత్రి హర్ష మల్హోత్రా

తిర్యాణి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా గిరిజన ఆవాసాల అభివృద్ధే ధ్యేయంగా కేంద్రం చర్యలు తీసుకుంటోందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల, కార్పొరేట్ వ్యవహరాల శాఖ సహాయ మంత్రి హర్షమల్హోత్రా అన్నారు. తిర్యాణి మండలం సుంగాపూర్ గ్రామంలోని శాటిలైట్ సెంటర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి జన్ మన్ పథకం కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే కోవ లక్ష్మిలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజనులు సంప్రదాయ గుస్సాడీ నృత్యం ద్వారా స్వాగతం పలికారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శాటిలైట్ సెంటర్ పాఠశాల ఆవరణలో అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పీవీటీజీల సాంప్రదాయ దేవతల పటాలకు, శాటిలైట్ సెంటర్ పాఠశాల స్థల ప్రదాత టేకం భీంపటేల్ విగ్రహాలకు పూజలు చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాన మంత్రి జన్‌మన్ పథకంలో భాగంగా పీవీటీజీల కొరకు ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆధార్ కార్డు లేని వారిని గుర్తించి వెంటనే ఆధార్ కార్డులు జారీ చేయాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యత స్టాల్ పరిశీలించి ఆదివాసీ గిరిజనులకు ఆర్థిక అక్షర్యాతపై అవగాహన కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం చేపట్టే ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, అటల్ బీమా యోజన, అటల్ పెన్షన్‌యోజన, ముద్రరుణాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ బ్యాంకు లింకేజీలపై ప్రత్యేక చర్యలుతీసుకోవాలని, ప్రధాన మంత్రి జన్‌మన్ కింద పీవీటీజీ గిరిజనులకు 11 రకాల వ్యాధుల పరీక్షలు నిర్వహించి వ్యాధి తీవ్రతను గుర్తించి అవసరమైన మందులు, శస్త్ర చికిత్సలు అందించాలన్నారు. పీవీటీజీ గ్రామాల్లో మొబైల్ యూనిట్ ద్వారా వైద్య సేవలు అందించం జరుగుతుందని తెలిపారు తిర్యాణి మండలం అస్పిరేషనల్ బ్లాక్‌గా గుర్తించడం ద్వారా పీవీటజీ గ్రామాలలో రహదారులు, తాగునీరు, వైద్యసేవలు, బహుళార్థక ప్రయోజన కేంద్రాల నిర్మాణాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.. అనంతరం కేంద్ర సహాయ మంత్రి చేతుల మీదుగా ఆధార్, జాబ్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు, జన్‌ధన్ ఖాతా పుస్తకాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమాధికారి రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు, పంచాయతీ రాజ్ ఈఈ కృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేష్ పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కేంద్ర రోడ్డు, రవాణా, రహదారులు, కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయమంత్రి హర్ష మల్హోత్రా అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాలలో మందుల నిల్వలు, రోగులకు అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని లింబుగుడ గ్రామంలో పీవీటీజీ ప్రధాన మంత్రి జన్ మన్ పథకం కింద రూ. 60 లక్షలతో నిర్మించిన బహుళార్థక ప్రయోజన కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో గల అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య కేంద్రం, కంప్యూటర్ తరగతి గది, పంచాయతీ కార్యదర్శి గదిని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడేపు భాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా వైద్య శాఖ అధికారి సీతారాం పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నేషనల్ హైవేకు అనుకొని ఉన్న అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని రూ. 8 కోట్ల అంచనా ప్రతులను కేంద్రమంత్రి హర్ష మల్హోత్రాకు బుధవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో మురికి కాలువలు, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు నిర్మించేందుకు నిధులు కేటాయించాలని కోరారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో గిరిజనులు అధిక సంఖ్యలో ఉన్నారని తప్పకుండా ఏకలవ్య పాఠశాలను మంజూరు చేయా లని విన్నవించారు. అలాగే అఖిల భారతీయ మాలీ మహ సంఘం నాయకులు మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని విన్నవించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలుగా ఉన్న మాలీలను ఎస్టీలుగా మార్చాలని ఉద్యమాలు చేసి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచిన కారణంగా మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో కలుపాలని రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి ఆమోదం కోసం కేంద్రానికి పంపించిందన్నారు. రెండు సంవత్సరాలుగా అ బిల్లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని, వెంటనే దానిని అమోదింపచేసి మాలీలకు ఎస్టీ హోదా కల్పించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలీ సంఘం నాయకులు శంకర్, దత్తు, సోమేశ్వర్, సాగర్, మారుతి పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర సరిహద్దులోని గోయేగాం గ్రామం నుంచి మంచిర్యాల వరకు నిర్మించిన 363 జాతీయ రహదారిపై బస్ షెల్టర్లు, కాలువల నిర్మాణాలు చేపట్టాలని బుధవారం కేంద్ర సహాయమంత్రి హర్ష మల్హోత్రాకు బీజేపీ, బీజేవైఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు చీడర్ల నరేష్, శెండే సోమేశ్వర్, సోయం సంజీవ్, వికాస్, వేణు, గోల్ల, నరేందర్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీ

సిర్పూర్(టి), జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2024-25కు సంబంధించిన ఈజీఎస్ పథకంలో చేపట్టిన పనులపై బుధవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సామాజిక ప్రజా వేదిక నిర్వహించారు. ఈజీఎస్, పంచాయా రాజ్, అటవీ శాఖ ద్వారా చేపట్టిన 434 పనులకు గాను సోషల్ ఆడిట్ నిర్వహించగా రూ.64,773 నిధులు దుర్విని యోగం అయినట్లు గుర్తించారు. నగదు రికవరీతో పాటు టీఏలు, ఎఫ్ఏలు, కార్యదర్శులకు రూ.8 వేల జరిమానా విధించినట్లు డీఆర్‌డీఏ పీడీ దత్తారావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, హెచ్ఆర్ మేనేజర్ మల్లేష్, ఏపీవో చంద్రయ్య, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఆడిట్ బృందం తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న బీజేపీ నాయకులు

చింతలమానేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఏడుగురు బాధితులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.2,38,000 చెక్కులను బీఏపీ నాయకులు బుధవారం అందజేశారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆదేశాల మేరకు బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, సుధాకర్, సత్తయ్య, పోషన్న, మోహన్, పవన్, బాలాజీ, కిష్టయ్య, రమేష్, మురలీ, భద్రశ్వర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లూరు గ్రామానికి చెందిన దుర్గం సిద్దుకు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బీజేపీ నాయకులు బుధవారం అందజేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బాధితుడికి చెక్కును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజేష్, రాజేశ్వర్, బాపూజీ, శోభన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశం బహిష్కరణ



సమావేశాన్ని బహిష్కరించిన ఫీల్డ్ అసిస్టెంట్లు

జైనూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వేతనాలు సక్రమంగా చెల్లించడం లేదని నిరసిస్తూ బుధవారం మండల పరిషత్ కార్యలయంలో నిర్వహించాల్సిన సమీక్షా సమావేశాన్ని మండల ఫీల్డ్ అసిస్టెంట్లు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు ఆత్రం రాజు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన వేతనాలు వెంటనె చెల్లించాలని డిమాండ్ చేశారు. 20 ఏళ్లుగా ఉపాధి పథకం కింద విధులు నిర్వస్తున్నామని చెప్పారు. అయినప్పటికీ తమ సమస్యలను ప్రభుత్వం గుర్తించడ లేదని ఆరోపించారు. తాము పడుతున్న ఇబ్బందులను గుర్తించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి ఆత్రం రవిందర్, జాదవ్ పండిత్, సభ్యులు సుభాష్, కాంబ్లే జ్ఞానోబా, జలపత్‌రావ్, చవ్హాన్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేటలో చోరీ

కౌటాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం సదాశివపేటలో మంగళవారం రాత్రి ఎడ్ల తిరుపతి అనే ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగినట్లు కౌటాల ఎస్సై విజయ్ తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు తిరుపతి కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 14న కరీంనగర్‌కు వెళ్లాడు. తిరిగి 15న రాత్రి 11 గంటలకు ఇంటికి రాగా ఇంట్లో దొంగలు ఉన్నట్లుగా గుర్తించారు. ఇంటి ముందర తలుపు తాళం పగలగొట్టి ఉండడంతో దొంగలను పట్టుకునేందుకు లోపలికి వెళ్లగా వారు ఇంటి వెనకి తలుపు నుంచి పారిపోయినట్లు ఎస్సై తెలిపారు. దొంగలు పారిపోతున్న సమయంలో సెల్‌ఫోన్ మర్చి పోయారు. దొంగలు ఉపయోగించిన సెల్‌ఫోన్‌తో పాటు చోరీకి ఉపయోగించిన వస్తువులను స్వాధీన పర్చు కున్నట్లు ఎస్సై తెలిపారు. ఇంట్లో ఉన్న ఏడు వేల నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. దొంగలు మహారాష్ట్రకు చెందిన వారని భావిస్తున్నామని, త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై తెలిపారు. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్

లారీ ఢీకొని ఒకరి మృతి

పెద్దపల్లి రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్ ఢీకొనడంతో వ్యక్తి కిందపడిపోగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొని మృతిచెందిన ఘటన పెద్దపల్లి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రికి చెందిన సింగరేణి ఉద్యోగి గాండ్ల సత్యం (53) తన కూతురు లావణ్యతో ద్విచక్రవా హనంపై పెద్దపల్లికి వెళ్తున్నాడు. అప్పన్నపే ట వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో వాహనం నడుపుతున్న సత్యం రహదారికి అవతల వైపు పడిపోవడంతో గోదావరిఖని వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతని వెంట వస్తున్న కూతురు లావణ్యకు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. సత్యం స్వగ్రామం ఓదెల కాగా ఉద్యోగరీత్యా మందమర్రిలో ఉంటున్నాడు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.

పశు వైద్యం.. గగనం

- శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల భవనం
- గ్రామీణ ప్రాంతాల్లో అందని సేవలు


శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల

కెరమెరి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో పశువైద్యంపై పట్టింపు కరువైంది. మండల కేంద్రంలోనే పశువైద్యశాలలో గత కొన్ని నెలల క్రితం వైద్యుడిని నియమించి నప్పటికీ కేవలం కెరమెరి పశువైద్యశాలలో మాత్రమే వైద్యం చేస్తున్నారని పశువుల పెంపకందారులు చెబుతున్నారు. కెరమెరి పశువైద్యశాలలో డాక్టర్, ఇద్దరు అటెండర్లు, ఒక వెటర్నరీ అసిస్టెంట్ ఉండాల్సి ఉండగా డాక్టర్‌తో పాటు ఇద్దరు అటెండర్లు మాత్రమే ఉన్నారు. ఒక వెటర్నరీ అసిస్టెంట్ డిప్యూటేషన్‌పై ఆసిఫాబాద్ పశువైద్యశాలలో విధులు నిర్వహిస్తున్నారు. వైద్యశాల కూలి పోయే దశకు చేరడంతో ఎంపీడీవో కార్యాలయం పక్కన భవనాన్ని అధికారులు తాత్కాలిక పశువుల ఆసుపత్రికి కేటా యించారు. పాత ఆసుపత్రి భవనంలోనే ప్రస్తుతం పశువైద్యం నిర్వహిస్తున్నారు. నూతన ఆసుపత్రిలో వ్యాక్సిన్ ఇతర సామగ్రి నిలువ చేస్తున్నారు.

సరిపడా సిబ్బంది లేక..

మండలంలో 31 గ్రామా పంచాయతీలు ఉండడంతో సరిపడా సిబ్బంది లేక వైద్యం అందడం లేదని చెబుతున్నారు. మండలం విశాలంగా ఉండడం వల్ల పశువైద్యం గ్రామాల్లో అందడం లేదని ఆయా గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు. మండలంలో పశు సంపద ఇలా ఉంది. మేకలు 33,273, గొర్రెలు 986, ఆవులు 18,057, గేదెలు 613, కోళ్ల 25,212 ఉన్నాయి. కాగా గోయగాం, అనార్‌పల్లి గ్రామాల్లో పశువైద్య సబ్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలని గ్రామీణ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. పై గ్రామాల్లో సబ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లయితే పశువైద్యం అందుబాటులో ఉంటుంది.

గోయగాం సబ్ సెంటర్ ఏర్పాటు వల్ల కోటారి, కోలాంగూడ, రింగస్‌ఘాట్, కల్లెగాం, పిట్టగూడ, ధనోర, పార్ధ, రాంజీగూడ, సావర్‌ఖేడ తదితర గ్రామాల పశువులకు సబ్ సెంటర్ అందుబాటులో ఉంటుంది. అలాగే అనార్‌పల్లిలో సబ్ సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల అనార్‌పల్లి, కరంజీవాడ, జన్కాపూర్, శంకర్‌లొద్ది, బొగుడగూడ, సోమ్లాగూడ, దేవాపూర్, పెద్ద కరంజీ వాడ, తదితర గ్రామాలకు అందుబాటులో ఉంటుంది. ఆయా గ్రామాల పశువుల పెంపకందారులు తెలుపు తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు తమ పశువులకు వైద్యం చేయించడానికి సుమారు 20 కిలో మీటర్ల పశువులని తీసుకు వెళ్లి వైద్యం చేయించడం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రైతులు చెబుతున్నారు.

సబ్‌సెంటర్ ఏర్పాటు చేయాలి..
శ్రీకాంత్, గోయగాం గ్రామస్థుడు



గోయగాంలో పశువైద్య సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలి. మండలంలో ఒకే పశువైద్య శాల ఉండడం వల్ల గ్రామాల్లో పశువైద్యం అందడం లేదు. దీంతో మేకలు, గొర్రెలు, గేదెలకు ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నాం. వెంటనే పశువుల సబ్ సెంటర్ గోయగాంలో ఏర్పాటు చేయాలి. పశు వైద్యం అనేది రైతుల జీవనోపాధికి చాలా ముఖ్యం. పశువులకు సకాలంలో వైద్యం అందేలా చూడాల్సిన అవసరం ఉంది.

రైతుల వెతలు ప్రభుత్వానికి పట్టడం లేదు


బెజ్జూరులో రైతులతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బెజ్జూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం వారి వెతలు పట్టడం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని బుధవారం సందర్శించి రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రైతుల అవస్థలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి 50 సార్లు వెళ్లారని, కనీసం 50 బస్తాల యూరియా కూడా తీసుకు రాలేక పోయారని ఆరోపించారు. ఢిల్లీ మీద ఉన్న ప్రేమ రైతులపై లేదా అని ప్రశ్నించారు. బుధవారం ముఖ్యమంత్రి వరంగల్ డిక్లరేషన్‌లో రైతు రాజ్యాంగా ప్రకటించారని, యూరియా దొరకక రైతులు సతమతమవుతుంటే ఏ మాత్రం పట్టించుకో కుండా ఉండడమేనా రైతు రాజ్యం అంటే అని ప్రశ్నించారు. 260 రూపాయలు ఉన్న యూరియాను దళారులు ఎక్కువ ధరలకు అమ్ముకుంటున్నా పట్టింపు లేదన్నారు. డీసీఎంఎస్ ద్వారా పంపిణీ చేస్తున్నారని దీనిపై అధికా రులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం విడ్డూరమని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే బీజేపీ నుంచి గెలిచి కేంద్రంలో ఉన్న ప్రభుత్వంతో పోరాడీ యూరియా తెప్పించలేక పోతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సారయ్య, ఖాజామో యినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ మృతి

నెన్నెల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. నెన్నెల ఎస్సై ప్రసాద్ చెప్పిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కోనంపేట గ్రామానికి చెందిన దుర్గం రాజేంద్రప్రసాద్ (26) ప్రైవేటు ఫైనాన్స్‌లో రెండేళ్ల కిందట గూడ్స్ వాహనం తీసుకొని నడుపుకుంటున్నాడు. సరైన గిరాకి లేక ఈఎంఐలు కట్టలేక పోతున్నానని ఇంట్లో చెప్పుకొని బాధపడేవాడు. రోజురోజుకు రుణభారం పెరిగి పోవడంతో నెలవారీ వాయిదాలు ఎలా చెల్లించాలో అర్థంకాక ఈ నెల 10న ఇంటి వద్ద గడ్డి మందు తాగి పడిపోయాడు. వాంతులు చేసుకుంటున్న రాజేంద్రప్రసాద్‌ను గమనించిన కుటుంబ సభ్యులు 108లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య

రామకృష్ణాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని గద్దెరాగడిలో గల సాయికుటీర్ ఏరియాలో నివాసం ఉండే చింతల సుధాకర్(71) అనే వృద్ధుడు జీవితంపై విరక్తితో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తరుచూ మద్యం తాగుతూ గొడవపడేవాడు. మానసికంగా ఒంటరి అనే ఆలోచనలతో బాధపడుతూ జీవితంపై విరక్తితో బుధవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట హైడ్రామా

ఆదివాసీ గిరిజన మహిళల బైండోవర్‌కు అధికారుల యత్నం
ఒప్పుకోని మహిళలు


మహిళలతో మాటాడుతున్న తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే

దండేపల్లి జూలై 16 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా దండేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట అధికారులకు, ఆదివాసీ గిరిజన మహిళలకు మధ్య బుధవారం హైడ్రామా నడిచింది. కొత్తగా పోడు వ్యవసాయం చేస్తున్నారని చెప్పి ఆదివాసీ మహిళలను బైండోవర్ చేయడానికి ఆటవీశాఖ అధికారులు దండేపల్లి తహశీల్దార్ కార్యాలయానికి తీసుకుని వచ్చారు. తాము బైండోవర్‌కు అంగీకరించమని మహిళలు కార్యాలయం బయట మూడు గంటల పాటు బైఠాయించారు. చివరకు బైండోవర్ అంగీకరించకుండానే వెళ్లిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లింగాపూర్ రిజర్వ్ ఫారెస్టులో 380 కంపార్ట్‌మెం ట్‌లో మాకులపేట పంచాయతీ పరిధిలోని రామునిగూడకు చెందిన కొంతమంది గిరిజన మహిళలు చెట్ల పొదలు తొలగించి ఇటీవల విత్తనాలు విత్తారు. దీంతో అటవీ శాఖ అధికారులు 26 మంది గిరిజన మహిళలపై కేసులు నమోదు చేశారు. బుధవారం 21 మంది మహిళలను బైండోవర్ చేసేందుకు అటవీశాఖ అధికారులు దండేపల్లి తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చారు. గిరిజనులు బైండోవర్ కావడానికి ఒప్పుకోలేదు. తహసీల్దార్ రోహిత్ దేశపాండే, ఎస్సై తహసీనోద్దీన్, అటవీ శాఖ అధికారులు మాట్లాడి వారికి నచ్చజెప్పినప్పటికీ వినిపించుకోలేదు. కేసులు నమోదుచేశాక బైండోవర్ ఎందుకని అధికారులను గిరిజన మహిళలు నిలదీశారు. సుమారు మూడు గంటలపాటు వేచిచూసి రాత్రి ఎనిమిది గంటలలకు తాము బైండోవర్ అయ్యేది లేదంటూ వెనుదిరిగి వెళ్లిపోయారు.

రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపిక

జన్నారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆకుల అనన్య వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రాజన్న, ఎంఈవో విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు, ఇతర చెడు వ్యసనాలకు నేటి యువత దూరంగా ఉండాలని విద్యాశాఖ నిర్వహించిన సేనో బీఫోర్ కిడ్స్ టూ లేట్ అనే కామిక్ వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థిని జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించిందని చెప్పారు. స్థానిక ఉపాధ్యాయులు దాముక కమలాకర్ ప్రోద్బలంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినిని డీఈవో యాదయ్యతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కిశోర బాలికల సంక్షేమానికి కృషి


హర్ష మల్హోత్రాకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎమ్మెల్యే

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు సంక్షేమానికి కృషి చేస్తున్నామని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల, కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష మల్హోత్రా అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో బుధవారం ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం కింద రూ.19 లక్షలతో నిర్మించిన ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వెంకటేష్‌దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే కోవ లక్ష్మిలతో కలిసి సందర్శించారు. కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న పోషక ఆహారంపై సమీక్షించారు. పిల్లలతో అక్షరాభ్యాసం చేయించి వంటశాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు, టీచర్లు ఏకరూప దుస్తులు ధరించడంపై అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు సరైన సమయంలో పోషక ఆహారాన్ని అందించాలని చెప్పారు. బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఆంగ్లంలో రాసిన కథలపై విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, ధ్రువపత్రాలు అందజేశారు. భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ సౌజన్యంతో అందించిన సంచార సైన్స్ ప్రయోగశాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ వెంకటేష్‌దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి ఎమ్మెల్యేలు పాల్వాయి హరీష్‌బాబు, కోవ లక్ష్మితో కలిసి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారికి సేవలు అందిస్తున్న డయాలసిస్ సెంటర్, ఆసుపత్రిలో వార్డులు సందర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో చదువుతున్న విద్యార్థుల వివరాలు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో మంత్రిని సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, డీపీవో భిక్షపతి, డీఎంహెచ్‌వో సీతారాం తదితరులు పాల్గొన్నారు.

వెనకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): దేశంలో వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర రోడ్డు రవాణా కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష మల్హోత్రా వెల్లడించారు. బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలంతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఝార్ఖండ్ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎంతో గొప్పగా అమలువుతున్నామయని చెప్పారు. దేశ వ్యాప్తంగా వెనకబడిర ప్రాంతాల్లో అలాగే అమలు చేసే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం తాగునీరు అందించే లక్ష్యంగా ప్రధాన మంత్రి యోజనల పేరుతో వివిధ రకాల పథకాలు అమలు చేస్తున్నామన్నారు. దేశంలో 140 కోట్ల జనాభా సంక్షేమం లక్ష్యంగా పని చేస్తున్నామని వివరించారు. దేశంలోని అకాంక్షిత జిల్లాలోని ఒక్కో మంత్రి పర్యటించి పరిస్థితి తెలుసుకుంటున్నారని అన్నారు. దీనిలో భాగంగా జిల్లాకు వచ్చిన తనకు జిల్లా ప్రజలు ఇచ్చిన స్వాగతం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. జిల్లాలో నేషనల్ హైవే నిర్మించామని అన్నారు. అయితే ఇతర రోడ్లు అభివృద్ధి కావాల్సి ఉందని వాటికి కావాల్సిన అటవీ అనుమతులు వచ్చే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. వెనుబడిన ప్రాంతాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. దీని కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో వన్‌నేషనల్ వన్ ఎలక్షన్ జిల్లా చైర్మన్ నాగేశ్వరరావు, జిల్లా నాయకులు విజయ్, మల్లికార్జున్ యాదవ్, విశాల్, అంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.



ఉద్యోగులు విధులకు గైర్హాజరు కావద్దు


మాట్లాడుతున్న ఎస్ఓటు జీఎం విజయ్‌ప్రకాశ్

మందమర్రిటౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు విధులకు గైర్హాజరు కావొద్దని ఎస్ఓటు జీఎం విజయ్‌ప్రకాశ్ అన్నారు. స్థానిక సీఈఆర్‌క్లబ్‌లో బుధవారం గైర్హాజరు కార్మికుల కౌన్సెలింగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా కార్మికులకు, వారి కుటుంబాలను ఉద్దేశించి మాట్లాడుతూ సింగరేణిలో మూడు దశాబ్దాల క్రితం పాతతరం కార్మికులు ఒక నాగ కూడ చేసేవారని కాదని తెలిపారు. అనుకోకుండా గైర్హాజరు అయితే ఆ రోజంతా బాధపడేవారని తెలిపారు. కాని ప్రస్తుతం కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలోకి వచ్చిన యువ కార్మికులు గైర్హాజరు కావడం తమకు ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం పని స్థలాలు మెరుగా ఉండడంతోపాటు సులువైన పనులే ఉన్నాయని ఎందుకు గైర్హాజరు అవుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఏ సంస్థలో లేని వేతనాలు సింగరేణిలో ఉన్నాయని తెలిపారు. అనారోగ్యం లేదా ఇతర సమస్యలు ఉంటే యాజమాన్యం దృష్టికితీసుకరావాలని చెప్పారు. అవి తమ పరిధిలోనివైతే పరిష్కరించి అండగా ఉంటామన్నారు. సింగరేణిలో ఒకసారి ఉద్యోగం పోతే తిరిగి తీసుకోవడం ఉండదనే విషయం గ్రహించాలని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఎం. కార్తీక్, అధికార సంఘం అధ్యక్షులు రమేశ్, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, కెకె1 సూపరిడెంట్ నాగేశ్వర్‌రావు, కేకే5 సంక్షేమాధికారి రవలి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో కమిటీల పేరుతో కాలయాపన


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి

కాసిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కమిటీల పేరుతో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కాలం వెళ్లదీస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి అన్నారు. కాసిపేట 2వ గనిపై బుధవారం ఏర్పాటు చేసిన గేటు మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ స్ట్రక్చర్ సమావేశాల్లో మాట్లాడుతున్నామని చెబుతూ కాల పరిమితులు లేని కమిటీల పేరు చెప్పి కాలం గడుపుతున్నారే తప్ప సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే క్యాడర్ స్కీంల కమిటీ పేరుతో ఆరు నెలలు గడిపారని అన్నారు. మారు పేరులతో సమస్యపై గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో కమిటీ అని చెప్పి అది ప్రభుత్వం చేతిలో ఉందని చేతులెత్తాశారని చెప్పారు. కార్మికులందరూ ఆశగా ఎదురు చూస్తున్న సొంతింటి కల కమిటీ ఊసెత్తడం లేదని విమర్శించారు. పైగా యాజమాన్యం ఎంతో ఖర్చు పెట్టి కొత్త క్వార్టర్లు కడుతున్నామంటే వ్యతిరేకించకుండ చూస్తుండిపోవడం చాలా బాధాకరమన్నారు. పెర్క్స్‌పై ఆదాయపన్ను మాఫీలో అధికారులకు లేని అడ్డంకి కార్మికులకు ఎందుకు వస్తుందో గుర్తింపు సంఘం తెలియజేయాలన్నారు. ఇప్పటికే లాభాల ప్రకటించాల్సిన యాజమాన్యం ఆలస్యం చేయడం సరికాదన్నారు. వెంటనే లాభాల వాటా ప్రకటించి కార్మికులకు అందజేయాలని కోరారు. మరో ప్రాతినిధ్య ఐఎన్‌టీయూసీ పదే పదే వినతిపత్రాలు ఇస్తూ శాలువాలు బొకేలతోనే సరిపెడుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం పెంచుతున్న పనిగంటల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సమ్మెకు మద్దతు తెలిపిన ఐఎన్‌టీయూసీ అసంఘటిత రంగంలో పని గంటల పెంపుకై కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన జీవోపై కనీస వేతనాల చైర్మన్ స్పందించి తనవైఖరి తెలియజేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై పోరాడే యూనియన్‌తో కలిసి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఐటీయూలో చేరిన కార్మికులకు కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్ష కార్యదర్శులు ఎస్. వెంకటస్వామి, అల్లీ రాజేందర్, నరహరి, మెండు శ్రీనివాస్, ఫిట్ సెక్రటరీ బుద్దే సురేశ్, కట్కం రమేశ్, ధనిశెట్టి సురేశ్, మహేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ బాధ్యతలు

కొప్పుల ఈశ్వర్‌కు అప్పగింత

శ్రీరాంపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) బాధ్యతలను యూనియన్ వ్యవస్థాపక సభ్యుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు అప్పగిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఉన్న బుధవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్‌ను పలువురు అభినందించారు. సమావేశంలో టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌మాదాసు రామ్మూర్తి, సీనియర్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, నాయకులు రవి, శంకర్, శ్రీనివాస్, సాంబయ్య, బండి రమేష్, సంపత్, సమ్మయ్య, వెంకటేశ్వర్లు, రాజయ్య పాల్గొన్నారు.

ఉద్యోగులు స్వీయ రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు స్వీయ రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ జీఎం(రక్షణ) రఘుకుమార్ అన్నారు. శ్రీరాంపూర్‌లోని వీటీసీలో ఈపీ ఆపరేటర్లు, ఎంవీ డ్రైవర్లకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణను వారు ప్రారంభించి మాట్లాడారు. గనులలో ప్రమాదాల నివారణకు సీఎంఆర్ 2017లో నిర్దేశించిన రెగ్యులైజేషన్ ప్రకారం సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ తయారు చేసి అమలు పరుచడంలో సింగరేణిలో జరుగుతుందని, ఎవరి పనికి సంబంధించిన సీఓపీ, ఎస్ఓపీ పాటించాలని, ఏమైనా లోటుపాట్లు కనిపిస్తే సూపర్‌వైజర్లకు, అధికారులకు తెలియజేయాలని చెప్పారు. ఉద్యోగులకు తగు భద్రత కల్పించాలని, ప్రమాదాలు నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఏరియా రక్షణాధికారి అజయ్ కుమార్, సిమ్‌టార్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్, వీటీసీ మేనేజర్ కమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మేడిపల్లి సంపత్


కేటీఆర్‌కు పూలమొక్క అందజేస్తున్న మేడిపల్లి సంపత్

మందమర్రిటౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బుధవారం మందమర్రి టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ హైదరాబాద్‌లోని కేటీఆర్ నివాసంలో కలిసి యూనియన్‌కు సంబంధించిన విషయాలపై చర్చించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పైన దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా సంపత్ కేటీఆర్‌కు పూలమొక్క అందజేశారు.

మారుపేర్లు మారేదెన్నడో?

(5వ పేజీ తరువాయి)

డిపెండెంట్ ఉద్యోగాలకు అవకాశాలు ఉండటంతో మారుపేర్లతో ఉన్న కార్మికుల పిల్లలు కొలువులో చేరేందుకు కూడా అడ్డంకిగా మారాయి. అనారోగ్య కారణాలతో కార్మికులు మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన సందర్భంలో తన తండ్రి పేరులో అక్షర దోషం ఉందనే సాకుతో పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చేందుకు సింగరేణి అధికారులు నిరాకరించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అలాంటి కేసులు కొత్తగూడెం కార్పొరేట్ విజిలెన్స్ విభాగం కార్యాలయంలో 6000కు పైగా పెండింగులో ఉన్నాయి. ఈ విషయమై గతంలో పలుమార్లు అప్పటి ముఖ్యమంత్రితోపాటు సంస్థ సీఎండీ దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు పరిష్కారం లభించలేదు.

● **ఏఐటీయూసీపైనే భారం...**

దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం ఎప్పుడు దొరుకుతుందోనని వందలాది కార్మిక కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ప్రాతినిధ్య సంఘంగా ఎన్నికైన ఏఐటీయూసీ అయినా కార్మికుల పక్షాన నిలిచి సమస్య పరిష్కారం కోసం పోరాడాలనే విజ్ఞప్తులు సర్వత్రా వినిపిస్తున్నాయి. సింగరేణిలో మారుపేర్ల మార్పిడి జరిగితే వందలాది కార్మికుల పిల్లలకు డిపెండెంట్ ఉద్యోగాలు లభించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ విషయమై దృష్టి సారించి వీలైనంత త్వరగా తమ సమస్యను పరిష్కరించాలని, అలాగే రాష్ట్ర కార్మికశాఖ మంత్రిగా జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న గడ్డం వివేకానంద మారుపేర్ల మార్పు కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని కార్మికులు కోరుతున్నారు.



పేర్ల మార్పిడికి కృషి...
వాసిరెడ్డి సీతారామయ్య,
ఏఐటీయూసీ అధ్యక్షుడు

మారుపేర్లతో సింగరేణిలో ఉద్యోగం చేస్తున్న కార్మికుల సంఖ్య వేలల్లో ఉంది. దశాబ్దాలుగా ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. కార్మికులకు సొంత పేర్లు వినియోగంలోకి తేవాలని ఇంతకు ముందున్న సింగరేణి సీఎండీ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లడం జరిగింది. ఇప్పుడున్న యాజమాన్యం కూడా స్ట్రక్చర్ మీటింగ్‌లో పేర్ల మార్పునకు అంగీకరించింది. ఈ విషయంలో న్యాయపరమైన సలహా కోసం యాజమాన్యం ప్రయత్నిస్తోంది. త్వరలోనే సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.

మోతాదుకు మించి ఎరువులను వాడవద్దు

కాసిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి):పత్తి పంటలో మోతాదుకు మించి రసాయనిక ఎరువులను వాడవద్దని మండల వ్యవసాయాధికారి చల్ల ప్రభాకర్ అన్నారు. బుధవారం రైతులకు యజామాన్య పద్ధతులు, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మోతాదుకు మించిన ఎరువులు వాడడం వల్ల చీడ పీడల ఉధృతి పెరగడంతో పాటు రసం పీల్చే పురుగులు ఎక్కువగా ఆశించే అవకాశం ఉందన్నారు. యూరియాకు బదులుగా నానో యూరియా ప్లస్ వాడాలని సూచించారు. రైతులు రైతు గుర్తింపు కార్డు కోసం ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పట్టాపాసుబుక్కు లేకుండా భూమిని సాగు చేస్తున్న రైతులు పంట వివరాలను స్థానిక రైతు వేదికలో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన

నెన్నెల, జులై 16 (ఆంధ్రజ్యోతి) ఆవడంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గ్రామదేవతలైన పోచమ్మ తల్లి, మదనపోచమ్మ, పోతరాజుల విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా గుడికి చేరుకొని బోనాలు పోసి, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. శని, ఆదివారాల్లో పోచమ్మ కొలుపు ఉంటుందని నిర్వహకులు తెలిపారు. మాజీ ఎంపీపీ సంతోషం రమాప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ తోకల పద్మ, మాజీ సర్పంచులు చీర్ల సత్యమ్మ, అర్కాల సత్యమ్మ, నాయకులు పాల్గొన్నారు.

స్వగ్రామం చేరుకున్న మాజీ మావోయిస్టులు

కోటపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాల కిందట అజ్ఞాతంలోకి వెళ్లిన ఆత్రం లచ్చన్న అలియాస్ గోపన్న, ఆయన భార్య చౌదరి అంకుబాయి అలియాస్ అనితక్కలు పోలీసుల ఎదుట లొంగిపోయి స్వగ్రామమైన మండలంలోని పారుపెల్లి గ్రామానికి చేరుకోగా బుధవారం పలకరింపుల పర్వం కొనసాగింది. ఎన్నడో అజ్ఞాతంలోకి వెళ్లి ఇక రాడనుకున్న లచ్చన్న పోలీసుల ఎదుట లొంగిపోయి పారుపెల్లికి చేరడంతో గ్రామస్థులు, బంధువులు లచ్చన్న ఎలా ఉన్నావంటూ ఆప్యాయంగా పలకరించారు. తల్లిదండ్రులు గోవారమ్మ భీమన్నలు గతంలోనే మృతిచెందగా ఈయన సోదరుడు హన్మంతు సైతం గతంలోనే మృతి చెందాడు. ప్రస్తుతం అతని వదిన లచ్చక్క, అమె కొడుకు అశోక్, కూతురు నాగమణి మాత్రమే ఉన్నారు. వారు పారుపెల్లిలో చిన్న పూరింట్లోనే జీవనం కొనసాగిస్తుండగా లచ్చన్న ఆచూకీ కోసం వచ్చే పోలీసులు పలు మార్లు వీరి పేదరికాన్ని గుర్తించి దాతృత్వంతో సరుకులు ఇచ్చి వెళ్లేవారు. కుటుంబసభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని లచ్చన్న లొంగి పోతే కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగించవచ్చని పలుమార్లు కోరారు. చివరకు లచ్చన్న అజ్ఞాతం వీడి జన జీవన స్రవంతిలోకి వచ్చారు. లచ్చన్న దంపతులు మంగళవారం రాత్రి గ్రామానికి చేరుకోగా గ్రామస్థులు మంగళహారతులు, డప్పుచప్పుళ్ల మధ్య స్వాగతం పలికారు.


జీవాల్లో వచ్చే వ్యాధులు..నివారణ



● వర్షాకాలంలో వివిధ రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదం

● సకాలంలో వైద్యం అందిస్తే మేలు

నస్పూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పశువులకు వివిధ రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుంది. పశు సంపదను కాపాడుకునేందుకు చికిత్సతో పాటు వ్యాధి నిరోధక టీకాలను వేయాల్సిన వసరం ఉంది. రైతులు పశువులకు సోకిన వ్యాధి లక్షణాలను సంబంధిత వైద్యాధికారుల దృష్టికి తీసుకెళితే సకాలంలో వైద్యం అందిస్తారు. వర్షాకాలంలో పశువులకు గొంతు వాపు, జబ్బ వాపు, చిటుక రోగం, ముసురు రోగం, నీలం నాలుక, గాలికుంటు వ్యాధులు సోకుతాయి. ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో వ్యాధి నిరోధక టీకాలను పశువులకు వేశారు. మంచిర్యాల జిల్లాలో గేదెలు 1.85 లక్షలు, ఎద్దులు, ఆవులు లక్ష, గొర్రెలు ఐదు లక్షలు, మేకలు 1.25 లక్షలు ఉన్నాయి. జిల్లాలో 27 పశు వైద్యశాలలు, 15 సబ్‌సెంటర్ల ద్వారా పశు సంపదకు వైద్య సేవలు అందుతున్నాయి. జిల్లాలోని అసుపత్రుల్లో కింది స్థాయి సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.





రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గాలి కుంటు వ్యాధి..

పశువులల్లో గాలి కుంటు వ్యాధి ప్రభావం అధికంగా ఉంటుంది. గాలి కుంటు వ్యాధి యుక్త వయస్సులో ఉన్న పశువుల్లో బలహీనంగా ఉండి వ్యాధి నిరోధక శక్తిని కోల్పోతుంది. దేశవాళి పశువుల్లో కంటే సంకర జాతి పశువుల్లో ఎక్కువ సోకుతుంది. పళ్ల చిగుళ్లు, నాలుక, ముట్టె లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడిన తర్వాత అవి 24 గంటల వ్యవధిలో చితికిపోతాయి. దీని మూలంగా నొప్పితో మేత తినదు, నోటి నుంచి చొంగ కారుతుంది. గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి ఆ తర్వాత అవి కూడా చితికిపోవడం వలన నొప్పితో సరిగ్గా నడవ లేవు. పొదుగు పై బొబ్బలు ఏర్పడి ఒక్కొక్కసారి పొదుగు వాపు వస్తుంది.

బ్యాక్టీరియా బొబ్బల ను ఆశించిడం వలన చీముతో కూడిన పుండ్లు తయారవుతాయి. నోటిలోని పుండ్లను బోరోగ్లిజరిన్, కాలి పుండ్లకు జింక్ ఆక్సైయిడ్, లొరాక్సిన్, హిమాక్స్ అయింట్‌మెంట్లను పూయాలి. ఈగలు వాలకుండా వేప నూనె, నిమ్మెంట్ వంటి మందుల్ని వాడాలి. గాలికుంటు వ్యాధి నివారణకు నిరోధక టీకాలను మొదటి రెండు నెలల వయస్సులో, బూస్టర్ డోసు ఒక నెల తర్వాత వేయించాలి. అనంతరం ప్రతీ సంవత్సరం క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి.

జబ్బవాపు వ్యాధి...

ఈ వ్యాధిని సొప్ప వ్యాధి అని కూడా అంటారు. క్లాస్ట్రిడియం చౌవై అనే బ్యాక్టీరియా ద్వారా పశువులకు సోకే అంటు వ్యాధి. ఆరు నెలల వయస్సులో ఆరోగ్యకరంగా, ధృడంగా ఉన్న పెయ్యల కు సోకుతుంది. ఇదీ వర్షకాలంలోనే ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. జబ్బువాపు వ్యాధి సోకిన పశువుకు 106 నుంచి 108 డిగ్రీల జర్వం, ఆకలి లేమి, నీరసం, నెమరు వేయకపోవడం, గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస కష్టంగా తీసుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సూక్ష్మ జీవులు భుజం, తొడ భాగాల్లోని కండరాల్లో మాంసం కుళ్లిపోయేలా చేస్తాయి. తద్వారా పశువులు నడవలేక కుంటుతాయి.

గొంతు వాపు వ్యాధి...

వర్షకాలంలో ప్రధానంగా వచ్చే వ్యాధుల్లో గొంతు వాపు ఒకటి. దీనినే గురక వ్యాధి అంటారు. జూన్ నుంచి సెప్టెంబరు నెలల్లో తొలకరి వర్షాలకు ఎక్కువ సోకుతుంది. గాలికుంటు వ్యాధి ప్రబలిన గ్రామాల్లో గొంతువాపు వ్యాధి ఎక్కువ సోకుతున్నట్లు గుర్తించారు. దీని మూలంగా పశువుల్లో రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల్లో శరీర ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. కంటి నుంచి నీరు, నోటి నుంచి చొంగ కారుతుంది. గొంతు, మెడ వాస్తాయి. శ్వాస కష్టతరంగా ఉంటుంది. ప్రతి ఏడాది గొంతు వాపు నివారణ కోసం టీకాలు ఇప్పించాలి. ఆరోగ్యకరమైన పశువులకు టీకాలు వేసి బూస్టర్ డోస్ తప్పక వేయించాలి.

ముందస్తు చర్యలను చేపట్టాం
డాక్టర్ శంకర్, పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి



పశువులకు వర్షకాలంలో సోకే వ్యాధులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే టీకాలను ఇచ్చాం. పశువులకు సోకిన వ్యాధుల గుర్తింపులో జాగ్రత్తలు తీసుకుని వైద్యం అందిస్తున్నాం. ఎక్కడైనా పశువులు వ్యాధుల బారిన పడితే నివారణకు సత్వరమే స్పందించి చికిత్స అందిస్తాం. గ్రామాల్లో పశువులకు వచ్చే వ్యాధులపై సమావేశాల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తూ నివారణ చర్యలతో పాటు సలహాలను అందిస్తున్నాం. పశువులకు సంబంధించి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉన్న ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలి.

డాక్టరేట్ పట్టా అందుకున్న కళాశాల ప్రిన్సిపాల్



పట్టా అందుకుంటున్న శంకర్

బెల్లంపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ) కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కాంపెల్లి శంకర్ బుధవారం గవర్నర్ చేతుల మీదుగా కామర్స్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. 2006 తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఎంకాం ఈ కామర్స్ చదివి పీజీ పట్టా అందుకున్న శంకర్ పీహెచ్‌డీ కామర్స్ విభాగంలో మొట్టమొదటి ర్యాంక్ సాధించి పరిశోధన ప్రారంభించారు. నిర్ణీతకాలంలో పరిశోధన పూర్తి చేసి కామర్స్ విభాగం నుంచి డాక్టరేట్ పొందారు. దీనికి సంబంధించిన కాన్వకేషన్ పట్టాను గవర్నర్ చేతుల మీదుగా అందుకున్నారు.

సంక్షిప్త సమాచారం

మందమర్రిటౌన్: పట్టణంలోని 3వ జోన్‌కు చెందిన అనుమాండ్ల శ్రీనివాస్ అనే వ్యక్తి పక్షవాతంతో బాధపడుతున్నాడు. దీనితో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం రూ.10వేల ఆర్థిక సాయం అందేశారు.

మందమర్రిటౌన్: మండలంలోని బొక్కల గుట్ట గాంధారీ మైసమ్మ ఆలయంలో బుధవారం అఖిలభారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు బండి సదానందం యాదవ్ మొక్కులు తీర్చుకున్నారు.

హాజీపూర్: ముల్కల్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంచిర్యాల ఐడీబీఐ బ్యాంక్ మూడు కంప్యూటర్లను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రాఘవేంద్రరావు, మెడిలైఫ్ ఆసుపత్రి డాక్టర్ కుమారస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బన్న రవీందర్ పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: మంచిర్యాల మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రేఖ తన భర్త ప్రభంజన్ యాదవ్ మృతదేహాన్ని జనగాం మెడికల్ కళాశాలకు దానం చేశారు.

హాజీపూర్: మండలంలోని నంనూర్ ఆర్ అండ్‌ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో మండల పూజను భక్తులు నిర్వహించారు.

జన్నారం: మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మిక సంక్షేమ సంఘం సభ్యుడు రాగం తిరుపతి తల్లి లింగవ్వ ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. గల్ఫ్ సంక్షేమ సంఘం సభ్యులు కుటుంబానికి 45వేల నగదు అందజేశారు. పులిశెట్టి నగేశ్ పాల్గొన్నారు.

తాండూర్: రేచినిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రోపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షుడు భట్టారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చెన్నూరు: మండలంలోని అక్కెపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని ఓ ఉపాధ్యాయురాలు తోటి ఉపాధ్యా యులను దూషించింది. 15 రోజులుగా సెలవులో ఉన్న ఉపాధ్యాయురాలు మంగళవారం విధుల్లో చేరింది. బుధవారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయురాలు పాఠశాలలోని మిగితా ఉపాధ్యాయులను ధూషించి వారితో గొడవకు దిగింది. ఎంఈవో రాధాకృష్ణ మూర్తి పాఠశాలకు చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అకారణంగా తమను తిట్టిందని ఐదుగురు ఉపాధ్యాయులు ఫిర్యాదు చేసినట్లు ఎంఈవో తెలిపారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన

లక్షెట్టిపేట, జులై 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఆరోగ్యశాఖ అధికారులు విద్యార్థులకు సికిల్‌సెల్ ఎనిమియాపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ మాట్లాడారు. సబ్ యూనిట్ అధికారి నాందేవ్, వెంకట్రావుపేట పీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్, పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

రైలు నుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు

ఓదెల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తు పడి యువ కుడికి తీవ్రగాయాలయ్యాయి. సికింద్రా బాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వైపు వెళ్తున్న భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీ డోర్ వద్ద కూర్చున్న మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన మాదాసు తరుణ్ (23) అనే వ్యక్తి ఓదెల రైల్వేస్టేషన్ ప్లాట్ ఫామ్ చివర ఆకస్మాత్తుగా రైలు నుంచి కిందపడడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. దీంతో 108 అంబులెన్స్ ద్వారా సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

వ్యాపారి ఇంటి ఎదుట బాధితుల ఆందోళన

- న్యాయం చేయాలని డిమాండ్ - ఎస్సై హామీతో ఆందోళన విరమణ

లక్షెట్టిపేట, జులై 16 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని బీట్ బజార్‌కు చెందిన మర్యాల విశ్వనాథం అనే వ్యాపారి ఇంటి ఎదుట దండేపల్లి, లక్షెట్టిపేట మండలాలకు చెందిన రైతులు, బాధితులు బుధవారం ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల ఒక వ్యాపారి సుమారు ఏడు కోట్ల రూపాయలకు ఐపీ పెడుతున్నట్లు సోషల్‌మీడియలో సుమారు 200మంది బాధితుల పేర్లతో జాబితా వైరల్ అయింది. వారం రోజుల క్రితం బాధితులంతా ఐపీ పెట్టి ఉడాయించాలనుకున్న అక్కనపల్లి శ్రీధర్ అనే వ్యాపారి ఇంటిని చుట్టుముట్టి ఆందోళన చేపట్టారు. బాధితుల్లో ఎక్కువ మేరకు రైతులు ఉండటంతో వారికి న్యాయం జరగాలని వ్యాపారి అక్కనపెల్లి శ్రీధర్‌పై దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఇదిలా కొనసాగతుండగా లక్షెట్టిపేట పట్టణానికి చెందిన మర్యాల విశ్వనాథం అనే మరో వ్యాపారి శ్రీధర్‌కు కొంత డబ్బు అప్పుగా ఇచ్చి బాండ్‌పేపర్స్‌తో పాటు ఇతర పత్రాలపై సంతకాలు తీసుకున్నాడని సమాచారం. మొన్నటి వరకు తాను కూడా బాదితుడినని చెప్పి దొంగచాటున అక్కెనపల్లి శ్రీధర్ ఆస్తులపై న్యాయస్థానం నుండి ఆర్డర్ తెచ్చుకున్నట్లు బాధితులకు తెలిసింది. దీంతో వారంతా లక్షెట్టిపేటకు చేరుకుని వ్యాపారి విశ్వనాథం ఇంటి ఎదుట బైఠాయించారు. సమాచారం అందుకున్న ఎస్సై గోపతి సురేష్ సిబ్బందితో కలిసి వచ్చి ఆందోళన కారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. న్యాయం జరిగేందుకు కృషి చేస్తామని చెప్పడంతో ఆందోళన సద్దుమనిగింది.

పాస్‌పోర్ట్ ఇవ్వడం లేదు...ఇంటికి రప్పించండి

- గల్ఫ్ బాధితుడి వినతి

జన్నారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన గొర్రె శాంతయ్య కువైట్‌లో చిక్కుకొని ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటికి వెళ్తానంటే పాస్ పోర్టు ఇవ్వడం లేదని స్వగ్రామానికి రప్పించాలని కోరుతూ సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వివరాల్లోకి వెళితే రెండు సంవత్సరాల క్రితం కువైట్ దేశం వెళ్లిన శాంతయ్య తన అగ్రిమెంట్ ముగిసిన తరువాత ఇంటికి వెళ్తానంటే జీతం డబ్బులు ఇవ్వకుండా పాసుపోర్టు ఇవ్వకుండా పది రోజులుగా తిండి లేకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం కలుగజేసుకొని స్వదేశానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని శాంతయ్యతో పాటు గ్రామంలో ఉన్న భార్య ప్రేమల, పిల్లలు సాయితేజ, వైష్ణవిలు కోరుతున్నారు.

పొలాలకు వెళ్లేందుకు దారి ఏర్పాటు

-హర్షం వ్యక్తం చేసిన రైతులు

భీమారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్టు రైతులు వారి పంట పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడేవారు. మామిడి తోటల నుంచి చేను చెలకల నుంచి రైతులు పొలాలకు వెళ్లేవారు. ప్రాజెక్టు సమీపంలోని మామిడి రైతులు, ఇతర భూముల రైతులు ఎవరి భూమి చుట్టూ వారు ఫెన్సింగ్ వేసుకోవడంతో రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. ప్రాజెక్టు మెయిన్ కట్ట పక్కనే రైతుల పొలాలకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా ఉండడంతో దారి వేయలేదు. ఈ విషయాన్ని రైతులు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేకుర్తి సత్యనారాయణరెడ్డికి తెలపడంతో ఆయన మంత్రి వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకువెళ్లారు. గత నెలలో మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించి దారి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. దీంతో బుధవారం రైతుల పంట పొలాలకు వెళ్లేందుకు మొరం పోయించి నీరున్న ప్రాంతాల్లో పైపులు వేసి దారిని ఏర్పాటు చేశారు. దీంతో రైతులు మంత్రికి, కాంగ్రెస్ నాయకుడు సత్యనారాయణరెడ్డికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



రైతులు పొలాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన దారి

రహదారికి మరమ్మతులు

భీమిని (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో బురదమయంగా ఉన్న అడవి, వ్యవసాయ పనులకు వెళ్లే రహదారికి శ్రీరామ సేవా సమితి, గ్రామస్థుల సహకారంతో బుధవారం మరమ్మతులు చేపట్టారు. ఆ రహదారిపై గతంలో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితిలో ఉన్న రహదారిపై ట్రాక్టర్ల సహాయంతో మొరం పోయించి చదును చేశారు. మరమ్మతులు చేయించిన వారికి గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పోతురాజుల నారాయణ, శ్రీరామ సేవాసమితి అధ్యక్షుడు పోతురాజుల లక్ష్మణ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు ఇవ్వాలి

కాసిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కాలేజీలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆయన మాట్లాడుతూ కాసిపేట మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు మోడల్ కాలేజీకి వివిధ దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు కళాశాలకు వస్తున్నారు. ఉచిత బస్సుపాసు లేకపోవడం వల్ల నిరుపేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరమవుతున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కార్తీక్, రవికుమార్, శోభన్, విఘ్నేశ్, రవీందర్ పాల్గొన్నారు.

ఆరోపణలు భరించలేక బలవన్మరణం

హాజీపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గుండా సునీత(36) అనే మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఎస్ఐ స్వరూప్‌రాజ్ కథనం మేరకు జన్నారంనకు చెందిన గుండా భూమయ్య సునీత దంపతులు పిల్లలతో కలిసి తల్లిగారి ఊరైన హాజీపూర్ మండల కేంద్రంలో నివాసం ఉంటున్నారు. భూమయ్య ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల ముల్కల్లకు చెందిన సమీప బంధువులైన ఇరువురు దంపతులు సునీతపై ఆరోపణలు చేస్తూ మానసికంగా వేధించారు. దీంతో సునీత మంగళవారం పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబసభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి భర్త భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాడుతాం

చెన్నూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రజల పక్షాన నిలిచి నిరంతరం పోరాటాలు చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పేర్కొన్నారు. బుధవారం చెన్నూరులో మండలస్థాయి ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయిన వివేక్‌వెంకటస్వామి ఎన్నికలకు ముందు 40 వేల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చి మర్చిపోయారన్నారు. జిల్లాలో భూగర్భ గనులను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు బడికెల మధునయ్య, నియోజకవర్గ కార్యదర్శి మిట్టపల్లి పౌలు, మండల కార్యదర్శి నెన్నెల సమ్మయ్య, నాయకులు సుంకరి చందు, నారాయణ, శంకర్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

మందమర్రిరూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం పొన్నారం గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండు వారాలకు పైగా దగ్గు ఉంటే పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచిత వైద్యంతో పాటు ప్రతి నెల వెయ్యి రూపాయల పోషణ భత్యం ఇస్తుందన్నారు. కాగా ఈ శిబిరంలో ఎక్స్‌రే కోసం పలువుర్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో వైద్యులు విష్ణుతేజ, భవాని, అభిజ్ఞ, శరత్, మధుబాబు, శ్రీలత, పద్మశ్రీ, ఫార్మాసిస్టు అజయ్, ఏఎన్ఎం శ్రీలత, సూపర్ వైజర్ విజయ, ఏఎన్ఎంలు గ్లోరి, శంకరవ్వ, జ్యోతి, మధుసూదన్, కుమారస్వామి, ఆశాలు పాల్గొన్నారు.

భారీ వాహనాలను అనుమతించాలి



దీక్షలో కూర్చున్న నాయకులు

జన్నారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం, దండేపల్లితోపాటు నిర్మల్ జిల్లా కడెం మండలం మీదుగా భారీ వాహనాలకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సామాజిక పోరాట సమితి మండల నాయకులు భూమాచారి, బద్రీనాయక్ దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీశాఖ ఆర్‌సీ నంబర్ 34357/2007, వైల్డ్‌లైఫ్ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని అన్నారు. లక్షెట్టిపేట నుంచి జన్నారం, నిర్మల్, ఆదిలాబాద్‌లకు వెళ్లే రహదారుల గుండా భారీ వాహనాలు రాకపోకలకు అనుమతించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

చెట్లు నరికిన మహిళకు జరిమానా

జన్నారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో అకారణంగా తొమ్మిది చెట్లను నరికిన వ్యక్తికి అధికారులు ఐదువేల రూపాయల జరిమానా విధించారు. తిమ్మాపూర్ గ్రామంలోని పల్లె ప్రకృతివనంలో ఏపుగా పెరిగిన తొమ్మిది చెట్లను అదే గ్రామానికి చెందిన గొల్కోండ రాజవ్వ అనే మహిళ నరికింది. విషయం తెలుసుకున్న ఎంపీడీవో ఉమర్‌షరీఫ్ ఐదువేల రూపాయల జరిమానా విధించారు. పల్లె ప్రకృతివనంలో 18 మొక్కలు నాటి సంరక్షించాలని ఆదేశించారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న ఇల్లందులో జరిగే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంతెన మల్లన్న పేర్కొన్నారు. బుధవారం మంచిర్యాలలోని మార్క్స్‌భవన్‌లో సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. రాష్ట్ర సదస్సులో కళాకారులు, ప్రజలు, విద్యార్థులు , మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజాధానాన్ని వృథా చేయడం సరికాదు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాధనాన్ని వృథా చేయడం సరికాదని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గాదె సత్యం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు హయాంలో ఏర్పాటు చేసిన ఐలాండ్‌లను దివాకర్‌రావుపై కక్షతో కూలగొట్టడం సరైంది కాదన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందన్నారు. సర్కిల్‌ల డిజైన్‌ల వెడల్పు ఎంత ఉండాలి అనేది అధికారులు, ఇంజనీర్లు వాళ్లకున్న రూల్ బుక్ ద్వారా నిర్ణయిస్తారని గత ప్రభుత్వ హయాంలోనూ అదే జరిగిందన్నారు. ఎక్కడా రాజకీయ జోక్యం లేకుండా సర్కిళ్లను నిర్మించారన్నారు. బీఆర్ఎస్ హయాంలో రాజకీయ జోక్యం లేదని, కాంగ్రెస్ పాలనలో సర్వం రాజకీయ జోక్యమే ఉందన్నారు. ప్రజాసొమ్మును నేలపాలు చేసే అధికారం ఎమ్మెల్యేకు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ఎ తప్పు చేస్తున్న అధికారులకు భవిష్యత్‌లో తిప్పలు తప్పవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరును ప్రజలు గమనిస్తున్నారని, వారే తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

మారుపేర్లు మారేదెన్నడో..?



- సింగరేణిలో ఏళ్లతరబడి కార్మిక కుటుంబాల ఎదురుచూపు
- డిపెండెంట్ ఉద్యోగాలపైనా తీవ్ర ప్రభావం
- గుర్తింపు సంఘంపైనే భారం
- ప్రభుత్వం పట్టించుకోవాలంటున్న కార్మికులు

మంచిర్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మారుపేర్లపై విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సొంత పేర్లు మారుస్తామన్న హామీ సంవత్సరాలు గడుస్తున్నా నెరవేరడం లేదు. సింగరేణి కార్మికులకు మారుపేర్ల స్థానంలో సొంతపేర్ల మార్పునకు చర్యలు చేపడతామని 2018లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా హామీ ఇచ్చారు. అయితే దాదాపు ఏడేళ్లు గడుస్తున్నా హామీ నెరవేరలేదు. పేర్ల మార్పిడి విషయంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఆ ప్రక్రియ అంతటితోనే నిలిచిపోయింది. సింగరేణి వ్యాప్తంగా మారుపేర్లతో విధులు నిర్వహిస్తున్న వారు సుమారు 6,000 మంది వరకు ఉంటారని సమాచారం. వీరంతా విధుల్లో చేరినప్పటి నుంచి సొంత పేర్లకు నోచుకోవడం లేదు.

● నిరక్షరాస్యులు కావడంతో...

సుమారు 40 సంవత్సరాల క్రితం ఉద్యోగాల్లో చేరిన వారు ఏ పేరుతో విధులు నిర్వహిస్తున్నారో కూడా తెలియని రోజులవి. దానికి తోడు అప్పట్లో అధిక శాతం మంది నిరక్షరాస్యులు సింగరేణి ఉద్యోగాల్లో చేరారు. ఎలాంటి విద్యార్హతలు లేకుండా బరువులు ఎత్తడం, పరుగు పందెంలో పాల్గొని విజయం సాధించిన వారికి సంస్థ నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పించింది. సరియైన ధ్రువీకరణ పత్రాలు లేని ఆ రోజుల్లో ఉద్యోగంలో చేరే సమయంలో సింగరేణి అధికారులు కార్మికులు చెప్పిన పేర్లను నమోదు చేసుకున్నారు. అప్పట్లో గ్రామాల్లో ఇంటి పేరుతో పాటు వారు పని చేసే కులవృత్తుల పేర్లతో కూడా సంబోధనలు ఉండేవి. అలా కులవృత్తుల పేరుతో పిలవబడే వారు ఉద్యోగంలో చేరిన తరువాత గనులపై ఆ పేరే కార్మికుల ఇంటి పేరుగా స్థిరపడింది. అప్పట్లో ఇంటిపేర్లపై పెద్దగా పట్టింపులు లేకపోవడం, పైగా నిరక్షరాస్యులు కావడంతో తమ పేర్ల గురించి కార్మికులు ఏనాడూ రికార్డుల్లో పరిశీలన చేసుకోలేదు. సొంతపేర్లు రికార్డుల్లో ఎక్కించుకోవాలన్న ఆలోచన కూడా కార్మికులకు రాలేదు. దీంతో దశాబ్దాల తరబడి మారు పేర్లతోనే ఉద్యోగాలు చేస్తున్నారు.

● డిపెండెంట్ ఉద్యోగాలపై ప్రభావం...

మారుపేర్లతో ఉద్యోగాలు చేస్తున్న కార్మికుల పిల్లలపై దాని ప్రభావం అధికంగానే పడుతోంది. అప్పటి కార్మికుల పిల్లల్లో ఉన్నత చదువులు చదివిన వారు అనేక మంది ఉన్నారు. వారి సర్టిఫికేట్లన్నీ సొంత పేర్లతోనే ఉన్నాయి. తండ్రి ఇంటి పేరులో దొర్లిన తప్పుల కారణంగా పిల్లల చదువుల్లోనూ దాని ప్రభావం పడుతోంది. అలాగే సింగరేణిలో..

మిగతా 7లో

నేడు, రేపు మంచినీటి సరఫరాకు అంతరాయం

మంచిర్యాలక్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలో గురు, శుక్రవారం పట్టణంలో మంచినీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని కమిషనర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వాటర్ ట్యాంక్ శుభ్రం చేసే కార్యక్రమం ఉన్నందున ఉదయం, సాయంత్రం మంచి నీటి సరఫరా అంతరాయం ఉంటుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

దండేపల్లి జూలై 16 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శపాఠశాలోని ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల గంటల ప్రాతిపదికన పని చేసేందుకు అర్హులైన ఎంఏ, బీఈడీ పూర్తి చేసి వారు దరఖాస్తు చేయాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రామగిరి రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదర్శ పాఠశాలోని ఖాళీగా ఉన్న పీజీటీ సివిక్స్, పొలిటికల్ సైన్స్ ఆంగ్లంలో బోధించటకు ఎంఏ బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు ఈనెల 19లోపు బయోడేటా ఫారం సంబంధించిన విద్యార్హతల జిరాక్స్ కాపీలతో ఆదర్శపాఠశాలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలన్నారు.

ఆర్థిక సాయం

దండేపల్లి జూలై 16 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్ గ్రామానికి చెందిన బొలిశెట్టి జ్యోతి భర్త శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలో జ్యోతితో చదువుకున్న 2001-02 బాల్య మిత్రులు తలా కొంత జమ చేసిన రూ. 30వేల ఆర్థిక సాయంను బుధవారం వెంకటాపూర్‌లో ఉంటున్న జ్యోతికి అందజేసి అండగా నిలిచారు.

సమస్యల పరిష్కారం కోసమే పొలంబాట

లక్షెట్టిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పొలంబాట కార్యక్రమం ఏర్పాటు చేసిందని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఉత్తమ్ అన్నారు. లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని గంపలపల్లిలో విద్యుత్ సిబ్బందితో కలిసి బుధవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. రైతుల వద్దకు అధికారులు నేరుగా వెళ్లి విద్యుత్ సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడంతో పాటు రైతులకు కెపాసిటర్ల గురించి అవగాహన కల్పించారు. ప్రతీరైతు తప్పకుండా విద్యుత్ మోటర్ వద్ద కెపాసిటర్ పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ ఖైసర్, ఏడీఈ ప్రభాకర్‌రావు, ఏఈ గణేష్, ఎల్ఎం రవికుమార్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

హాజీపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాపల్లిసబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 11కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను జిల్లా విద్యుత్‌శాఖ అధికారి జాడే ఉత్తమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ ఈ నూతన బ్రేకర్‌తో ధర్మారం, నర్సింగాపూర్, రాపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీఈ కైజర్, ఏడీ వెంకటేశ్వర్లు, ఏఈ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

● కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ సూచించారు. బుధవారం చెన్నూరు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, తాగునీరు, వంటశాల, భోజనశాల, వసతి గృహంలోని వసతులు, పడకలు, మూత్రశాలలు, గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆహారం తయారీ సమయంలో నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలన్నారు. శుద్ధమైన తాగునీటిని విద్యార్థులకు అందించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల, కేజీబీవీలో కిటికీలు, తలుపులు, మూత్రశాలలు, ఫ్యాన్‌లు, లైట్లు ఇతర పాడైన వాటిని పరిశీలించి మరమ్మతులు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని, ఎంపీడీవో మోహన్‌ను ఆదేశించారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కస్తూర్బాదాంధీ బాలికల విద్యాయలంలో పాడైన ఆర్‌వో ప్లాంట్‌ను మరమ్మతులు చేసి శుద్ధమైన నీటిని అందించాలని, పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కోటపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం మండల కేంద్రం లోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు.



కోటపల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, తాగునీరు, వంటశాల, భోజనశాల, వసతి గృహంలోని వసతులు, పడకలు, మూత్రశాలలు, గదులను ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకల సౌకర్యాలను కల్పించిందన్నారు. ప్రతి పాఠశాలలో తాగునీరు, మూత్రశాలలు, విద్యుత్ ప్రహరీ లాంటి అన్ని మౌలిక సదుపాయాలను కల్పించిదన్నారు. మెను ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. బడిమానేసిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలకు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం పదవతరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న మూత్రశాలల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సత్వరం పూర్తిచేయాలని ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, మండల పరిషత్ సూపరింటెండెంట్ లక్ష్మయ్య, ఏపీవో వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధునయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవాల్లో వచ్చే వ్యాధులు.. నివారణ

7

- వర్షాకాలంలో వివిధ రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదం
- సకాలంలో వైద్యం అందిస్తే మేలు

పశు వైద్యం.. గగనం

- శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల భవనం
- గ్రామీణ ప్రాంతాల్లో అందని సేవలు

6

మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివెల్

మంచిర్యాలక్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నగరపాలక సంస్థ వందరోజుల కార్యక్రమంలో భాగంగా ఇందిరా మహిళాశక్తి యూనిట్ ద్వారా ఉపాధి పొందిన స్వయంసహాయ సభ్యులతో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ సంపత్ ప్రారంభించారు. ఆయనతో పాటు మున్సిపల్ మేనేజర్ కరుణాకర్, బ్యాంక్ రీజినల్ మేనేజర్ ప్రభుదాసు, మెప్మా టీఎంసీ చంద్రయ్య, పీవోలు సుజాత, అరుణ, సుజాత, డీఈవో సునిత, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

బెల్లంపల్లి సబ్‌డివిజన్‌లోని ఎస్ఐల బదిలీ

బెల్లంపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి సబ్‌డివిజన్‌లోని ఎస్ఐలను బదిలీ చేస్తూ బుధవారం రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించిన గంగారాం దేవాపూర్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ అయ్యారు. దేవాపూర్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించిన ఆంజనేయులు కాసిపేట పోలీసుస్టేషన్ హెచ్‌వోగా బదిలీ అయ్యారు. కాసిపేట ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించిన ప్రవీణ్‌కుమార్ భూపాలపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. తాళ్లగురిజాల పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించిన సీహెచ్ రమేశ్ బదిలీ కాగా ములుగు జిల్లా ఏటూరు నాగారం పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహించిన బండి రామకృష్ణ తాళ్లగురిజాలకు బదిలీ అయ్యారు. తాండూర్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించిన కిరణ్‌కుమార్ బెల్లంపల్లి టూటౌన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ అయ్యారు

కల్లు కాంపౌండ్‌లో తనిఖీలు



శాంపిల్స్‌ను సేకరిస్తున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మంచిర్యాలక్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో తెల్ల కల్లు కాంపౌండ్ సేకరణ కేంద్రంలో బుధవారం టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సీఐ సమ్మయ్య సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. 'ఆంధ్రజ్యోతి' జిల్లా పేజీలో 'కల్తీ కిక్కు' అనే కథనం ప్రచురితంకాఆగా ఎక్సైజ్ అధికారులు మంచిర్యాల జిల్లా కేంద్రంలో దాడులు నిర్వహించారు. డిపోలో తెల్లకల్లు మూడు బాటిళ్లలో శాంపిల్స్ సేకరించి నిజామాబాద్ ల్యాబ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ సమ్మయ్య మాట్లాడుతూ సేకరించిన శాంపిల్స్‌ను నిజామాబాద్ ల్యాబ్‌కు తరలించామన్నారు. ఈ ల్యాబ్ రిపోర్టు అనంతరం డిపోపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సాగర్, రమేశ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం



సభ్యత్వ నమోదు రశీదును అందజేస్తున్న మోహన్‌రావు

కాసిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పీఆర్‌టీయుతోనే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమవుతాయని పీఆర్‌టీయు మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బచ్చ మోహన్‌రావు అన్నారు. బుధవారం ధర్మరావుపేట జిల్లా పరిషత్ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. రాబోయే రోజుల్లో ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల పరిష్కారానికి ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు, డీఏల ప్రకటన. పీఆర్‌సీ ఫిట్‌మెంట్ కోసం పీఆర్‌టీయు పని చేస్తుందన్నారు. డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత ఫించన్ అమలు చేసే విధంగా పోరాటం చేస్తామన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంప శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎం. సాంబమూర్తి, ఎంవిఎస్ ప్రసాద్, పి. నాగేశ్వర్‌రావు, అన్నం రమణారెడ్డి, బండ శాంకారి, మహేశ్వర్, కృష్ణగోపాల్, మూర్తి, లు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌ను తొలగించాలి

బెల్లంపల్లి, జూలై16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అంబేద్కర్ ఫంక్షన్‌హాల్ కోసం మూడు ఎకరాల స్థలం కేటాయించారని ఈ స్థలంలో కొందరు వ్యాపారస్తులు కూరగాయలు విక్రయిస్తున్నారని వెంటనే తొలగించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు మాలమహానాడు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూరగాయల నిర్వహణవల్ల అంబేద్కర్ ఫంక్షన్‌హాల్‌కు రావాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కొంతమంది దళారులు వ్యాపారప రంగా వాడుకుంటున్నారని వెంటనే ఖాళీ చేయించాలని కోరారు. కూరగాయల వ్యాపారం నిర్వహించడం వల్ల ప్రహరీ నిర్మించలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రహరీ లేకపోవడంతో ఆకతాయిలు రాత్రివేళల్లో మద్యం సేవిస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే కూరగాయల మార్కెట్ వ్యాపారస్తులను ఖాళీ చేయించి ప్రహరీ నిర్మించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమేశ్‌ను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షులు కుంబాల రాజేశ్, పట్టణ అధ్యక్షుడు సుభాష్, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు కొమురయ్య, పాల్గొన్నారు.

కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ డిమాండ్ చేశారు. కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని కోరుతూ చేపట్టిన లక్ష పోస్టుకార్డుల ఉద్యమం బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1921లో ఇంపీరియల్ బ్యాంకు కుప్పకూలినప్పుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపాయి దాని సమస్య పరిష్కారమార్గం అనే పుస్తకాన్ని పలు కమిషన్లతోపాటు బ్రిటీష్ ప్రభుత్వానికి ఇచ్చారన్నారు. ఇది వాస్తవమని గ్రహించి 1935 ఏప్రిల్ 1న రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఏర్పడిందని, అంబేద్కర్ లేకుంటే ఆర్బీఐ లేదన్నారు. కేంద్రప్రభుత్వం కరెన్సీనోట్లపై అంబేద్కర్ ఫొటోను ముద్రించాలని డిమాండ్ చేశారు. 26 జనవరి 2026 వరకు లక్ష పోస్టు కార్డుల ఉద్యమం చేపడతామని, దేశ ప్రధానికి పోస్టుకార్డులు పంపుతూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కనకరాజు, నాయకులు బొల్లి స్వామి, రాజారాం, దశరథం, సత్యం, సిద్దార్థ్, రామ్మూర్తి, రవికుమార్, స్వామి, సత్యం, రాజేశం, శంకర్‌వర్మ, వీరస్వామి, రాజు, శంకర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈవో

నస్పూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మండల విద్యాధికారి పద్మజా బుధవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిలో నిత్యావసర సరకులను పరిశీలించారు. అలాగే ఇటీవల ఓ విద్యార్థి భవనం పైనుంచి దూకిన సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. భవనంపైన చుట్టూ గోడఎత్తు పెంచాల్సిన వరం ఉన్నదని గుర్తించినట్లు ఎంఈవో పద్మజా తెలిపారు. నస్పూర్‌కు రెండు ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. హౌసింగ్‌బోర్డు కాలనీ, సుభాష్‌నగర్ ఏరియాలకు పాఠశాలలు ఏర్పాటుకు స్థల పరిశీలన, ఆ ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు అందుబాటులో ఖాళీగా ఉన్నట్లయితే వాటిని పరిశీలిస్తామని ఎంఈవో తెలిపారు.



కస్తూర్బా పాఠశాలలో నిత్యావసర సరకులను పరిశీలిస్తున్న ఎంఈవో పద్మజా

తాండూర్: తాండూర్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని బుధ వారం మండల విద్యాధికారి మల్లేశం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులు భోజనం చేస్తుండగా భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందుతుందా అని అడిగారు. వంటచేసే నిర్వహకులకు పలు సూచనలు చేశారు. వంటగదిని శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. అనంతరం 10వతరగతి విద్యార్థినాల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. బోర్డుపై వారిచేత ప్రశ్నలకు సమాధానాలు రాయించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తానని తెలిపారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి సాయికిరణ్

● లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్

లక్షెట్టిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ కాసమల అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఎంపీడీవో మీటింగ్ హాలులో అంగన్‌వాడీ కార్యకర్తలకు న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జూనియర్ సివిల్ జడ్జి హాజరై మాట్లాడారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటిపరిష్కారంతో పాటు వాటికి సంబంధించిన చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. అంతకు ముందు అధికారులు జూనియర్ సివిల్ జడ్జిని సన్మానించారు. కార్యక్రమంలో పీడీ రౌఫ్‌ఖాన్, సీడీపీవోరేష్మా, ఎంపీడీవో సరోజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, న్యాయవాదులు, లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆషాఢమాసం బోనాలు



బోనాలతో భక్తులు

బెల్లంపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం బోనాలను బుధవారం బుగ్గ కొండ పోచమ్మ ఆలయంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. బోనాలను తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిఏటా ఆషాఢమాసంలో కొండ పోచమ్మ దేవాలయంలో ఆషాఢబోనాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బుగ్గ అన్నదాన ట్రస్టు చైర్‌పర్సన్ మాసాడి శ్రీదేవి, డైరెక్టర్లు స్వరూప, భరత్, బాలక్రిష్ణ, గోపి, వినయ్, సాగర్, చంద్రయ్య, భక్తులు పాల్గొన్నారు.

చెన్నూరు: మండలంలోని నాగాపూర్‌లో చిన్నన్న పెద్దన్న బోనాలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు బోనాలతో డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలను సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నారు.